సమయం మధ్యాహ్నం రెండుగంటలు...

రోహిణికార్తె ఇంకా ప్రవేశించకపోయినా ఎండమాత్రం, రోళ్ళు బద్దలయ్యేలా - విరగబడి కాస్తోంది. ఎర్రటి నిప్పుల పైనించి వస్తున్న వేడి సెగల్లా - వడగాడ్పులు వీస్తున్నాయి.

అలాంటి సమయంలో రైలుదిగి స్టేషన్లోంచి బయటకు వచ్చాడు విశ్వనాథం!

కుడిచేతిలోవున్న సంచిని ఎడంచేతిలోకి మార్చుకుని పైమీది కండువాతో ఓ సారి ముఖం తుడుచుకున్నాడు... బయట ఎండ, వడగాడ్పులకు సాయం, లోపల అతనికి ఆకలి దంచేస్తోంది. అసలు రైలు సరైన సమయానికి వచ్చివుంటే, ఈ పాటికి ఎప్పుడో ఇల్లు చేరుకుని, భోజనం ముగించి, ఓ కునుకు తీస్తూండేవాడు... కానీ, తన అదృష్టంలాగే, ఆ రోజు బండి మూడు గంటలు లేటుగా వచ్చింది...

"ఇంత ఎండలో ఇంటికి ఎలావెళ్ళటం?" - అనుకున్నాడు విశ్వనాథం నిర్మానుష్యంగా వున్న తార్రోడ్డు వైపు చూస్తూ.

అక్కణ్ణించి, తన ఇల్లు మహావుంటే — అరమైలు దూరంలో వుంటుంది...చకచకా నడిస్తే పావుగంటలో చేరుకోవచ్చు...

కానీ, అడుగుతీసి అడుగువేయాలంటేనే భరించలేనంత నిస్త్రాణగావుంది విశ్వనాథానికి. అలాంటప్పుడు అరమైలు నడవటమంటే మాటలా?...

ఒకవేళ - తాను వెళ్ళినపని విజయవంతంగా పూర్తి అయ్యుంటే - ఒంట్లోకి వెయ్యి ఏనుగుల బలం వచ్చివుండేది...అప్పుడు ఆకలి, ఎండా, వడగాడ్పులా - ఇలాంటి వాటిని లక్ష్యపెట్టకుండా పరుగులాంటి నడకతో ఇంటికి వెళ్ళేవాడు...ఆ శుభవార్తను అలివేలుకి చెప్పి — అదంతా తన ప్రయోజకత్వమన్నట్టుగా పోజపెట్టేవాడు!...

మరి ఇప్పుడు ఇంటికి వెళ్ళి - భార్యకు ఏం చెప్పాలి?... కథ మళ్ళీ మొదటికి వచ్చిందని చెప్పాలా?... అరుణకు సంబంధం వెతకటానికి మరోకొత్తజోడు కొనుక్కోవాలా?...

"రిక్షా తెమ్మంటారా బాబూ?" - అంటూ అంతలోనే పక్కనున్న రిక్షావాలా పలకరించాడు విశ్వనాథాన్ని.

భగవంతుడు ప్రత్యక్షమై - 'నీకేం కావాలో కోరుకో' - అన్నట్టుగా తోచిందిఅతనికి...కానీ, అదే క్షణంలో అతని నరాల్లో మళ్ళీ నిస్సత్తువ ఆవరించింది.

ఆ కాస్త దూరంలోనే రిక్షావాలా కనీసం రెండు రూపాయలైనా అడుగుతాడు...

పదేళ్ళ క్రితం ఇలా వుండేదా పరిస్థితి!...

అప్పుడు తమ ఊళ్ళో పాతికో ముప్ఫయ్యో రిక్షాలుండేవి...తను ఎప్పుడైనా స్టేషన్లో దిగి - బయటికొస్తే ఏమీ చెప్పాల్సిన పనిలేకుండా రిక్షా ఎక్కి - కూర్చుని 'పోనీయ్' అనేవాడు.

ఇంటి దగ్గర రిక్షాదిగి ఓ అర్ధరూపాయి రిక్షావాలా చేతిలో పెడితే, అదే ఒక వరహాగా భావించి పొంగిపోయి తృప్తిగా దాన్ని బనీను జేబులోవేసుకుని - తనకు ఓ నమస్కారంకూడా పెట్టిమరీ వెళ్ళిపోయేవాడు... ఇప్పుడు ఆ తృప్తి ఆ రకమైన గౌరవం ఎవరిలో ఉంటున్నాయి కనక?

అంతా పోటీ బ్రతుకై పోతోంది...ఎంత వచ్చినా వెలితిగానే ఉంటుంది!

అసలు ధరలు మండి పోతూంటే వాళ్ళు మాత్రం ఏం చేస్తారు!...

"రిక్షా వేస్తాను బాబూ!" - రిక్షావాలా మళ్ళీ హెచ్చరించటంతో ఆలోచనలు వదిలిపెట్టి వాస్తవానికి వచ్చాడు విశ్వనాథం.

"గాంధీ బొమ్మదగ్గరకు ఏమిమ్మంటావ్?" అడిగాడు...

"మీకు తెల్దేటి బాబూ?... ఎక్కండి!" అన్నాడు వాడు రిక్షాను ముందుకు తెచ్చి.



# జోడిగుంట రామచంద్రమూర్తి

# 'ఉప్పు కప్పురంబు'

"రెండ్రూపాయలిస్తాను! మళ్ళీ తర్వాత పేచీ పెట్టకు!"—అంటూ ఎక్కికూర్చున్నాడు విశ్వనాథం...

"తమదగుబాబూ! ఈ ఎండలో తొక్కాల అంతా మెరక ... కట్టంచూసి ఇంకో అర్ధ రూపాయిచ్చేయండి బాబూ!" — రిషావాలా అన్నాడు.

అతనిలోని నమ్రతా భావం విశ్వనాథాని కెంతో నచ్చింది. అందుకే మరేం బదులు చెప్ప లేకపోయాడు...పైగా వాడు-అడిగిందీ సబబు





గానే తోచింది...తను హాయిగా రిక్షాలో కూర్చున్నాడు...వాడు మాత్రం ఆ ఎర్రని ఎండలో, ప్రయాసపడుతూ తనను లాక్కె ళ్ళాలి...

అసలీరోజుల్లో రెండ్రూపాయలకు విలువే ముందీ?... ఒకపుడు, అపుడెపుడో, తను కాపురం పెట్టిన కొత్తలో పది రూపాయలు పెడితే అయిదు కుంచాల బియ్యం వచ్చేవి... ప్రతి శనివారం నాలుగేసి గుప్పిళ్ళు దాన ధర్మాలు చేసినా, నెల రోజులు సరిపోయేవి... అప్పుడు రెండ్రూపాయలుపట్టుకుని సంతలోకి వెడితే రెండు సంచులనిండా కూరలొచ్చేవి! ఇప్పుడు రెండ్రూపాయలకూరలు తేవాలంటే రెండు చేతులూ వూపుకుంటూ వెళ్ళిరావచ్చు...

'గుప్తుల కాలం' ఎలా వుండేదో తనకు తెలియదుకానీ-తాను పెళ్ళి చేసుకుని కాపురం పెట్టిన తొలి రోజులే 'స్వర్ణయుగం' అను కుంటూంటాడు విశ్వనాథం.

రాను రాను కుటుంబం పెరిగింది...అవస రాలు ఎక్కువైయ్యాయి...ధరలూ పెరిగాయి

'తనలాంటి మధ్య తరగతి కుటుంబీకుడు, వచ్చే జీతంలో నిత్యావసరాలు తీర్చుకోలేక సతమతమై పోతూంటే, కూలీనాలీ చేసుకునే అట్టడుగు జనం ఎలా బతగ్గలుగుతున్నారో'-అనుకున్నాడు విశ్వనాథం.

"రోజూ నువ్వెంత సంపాదిస్తావ్?" ప్రశ్నించాడు రిషావాలాని.

"అంతా గాలివాటం బాబూ! వస్తే ఒకరోజు పాతికా ముప్ఫయ్ వస్తాయి. లేకపోతే పదీ పరకా కూడా గిట్టుబాటు కాదు!" ఓ చేత్తో నుదుటిమీద పట్టిన చెమట తుడుచుకుంటూ చెప్పాడు.

"సరిపోతుందా మరి?"

"సరిపెట్టుకుంటాం బాబూ! ఎక్కువచ్చి నప్పుడు రెండ్రూపాయలు ఎనకేసుకుంటే-రానపుడు సద్దుకుంటాం! నా యింటిది కూడా నాలుగిళ్ళల్లో పని చేస్తుంటుంది!"

"పిల్లలెంతమంది?" వెంటనే ప్రశ్నించాడు విశ్వనాథం.

"ఇద్దరే బాబూ! ఆడపిల్లలు!"

మళ్ళీ మరేం అడగలేదు విశ్వనాథం...

రిక్షా ఎత్తు ఎక్కుతోంది...ఎండలో రిక్షా వాలా నల్లటి శరీరం చెమటలో తడుస్తూ మెరుస్తోంది...

"నాకు పుట్టింది ఒక్కత్తేబాబూ!... కానీ నాకో చెల్లెలుంది... దాన్నికూడా నా బిడ్డలాగే